క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో చేరడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 సంవత్సరానికి గాను మూడవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రిషియన్ 8, ఫిట్టర్ 17, ఎలక్ట్రానిక్ మెకానిక్ 24, డ్రాఫ్ట్ మెన్ సివిల్ 23, కోపా 22 సీట్లు కాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎనిమిది, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2024 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే దరఖాస్తులకు అర్హులని పేర్కొన్నారు.

నియామకం



గోవిందరావుపేట: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల కమిటీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు సన్నగుండ్ల వెంకటేశ్వర్లు నియామకం అయ్యారు. జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు డా.మొగుళ్ల భద్రయ్య నియామక ఉత్తర్వులను అందించినట్లు ఎన్నికల కన్వీనర్ కోడిపాక రవి మంగళవారం తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన నాయకులకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పూర్తి మండల కమిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీల నియామకం పూర్తి చేస్తానని అన్నారు.

విద్యుత్ తీగ పట్టుకుని యువకుడి ఆత్మహత్య


రాము(ఫైల్)

గోవిందరావుపేట: ఇంట్లో గొడవలు, భార్య కొద్ది కాలం క్రితం విడాకులు తీసుకుని బిడ్డతో వెళ్లిపోడంతో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి విద్యుత్ తీగ పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని పస్రా గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. పస్రా గ్రామానికి చెందిన బండ రాము (28) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్ది కాలం క్రితం భార్య విడాకులు తీసుకుని బిడ్డతో అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. బుధవారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న కరెంట్ వైరును పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.


నిత్యావసర సరుకుల పంపిణీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో తండ్రి, కుమారుడు బీసుల లస్మయ్య, కృష్ణంరాజు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వెన్నపురెడ్డి సురేష్, చల్ల దేవేందర్ రెడ్డి, ఎల్లంకి శశికుమార్‌లు బుధవారం పరామర్శించి 75కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ కొట్టే సతీశ్, హైమద్, కురుసం సాగర్, గడ్డం రాజుగౌడ్ పాల్గొన్నారు.

సూరారంలో..

సూరారం గ్రామానికి చెందిన జర్నలిస్టు తూడిచెర్ల దుర్గయ్య తండ్రి తూడిచెర్ల పెద్ద లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల రమేష్‌రెడ్డి పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు తులసి మహేశ్, మాజీ సర్పంచ్ చుక్క మల్లయ్య, సీనియర్ నాయకులు ఓడేటి రాజిరెడ్డి, రత్న రాజిరెడ్డి, చల్ల మహేశ్, జిల్లెల నాగరాజు, కావేటి రాజేశం, నాగుల అశోక్, మాజీ వార్డు సభ్యులు సంధ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైటెన్షన్ కరెంట్ పోల్‌ను ఢీకొట్టిన లారీ



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి–పరకాల జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రోడ్డు పక్కనే ఉన్నటువంటి హైటెన్షన్ కరెంట్ పోల్‌ను లారీ ఢీ కొట్టిన సంఘటన కుందూరుపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి చెల్పూర్ వైపు ముందు వెళ్తున్న ఇసుక లారీని వెనుకాల వైపు నుంచి వస్తున్న బొగ్గు లారీ ఢీ కొట్టింది. దీంతో ఇసుక లారీ రోడ్డు పక్కకు దుసుకువెళ్లి హైటెన్షన్ కరెంట్‌పోల్‌ను ఢీ కొట్టినట్లు తెలిపారు. అర్ధరాత్రి రావడంతో ఇతర వాహనాలు లేకపోవడం, హైటెన్షన్ కరెంట్ వైర్లు తెగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్లకు గాయాలైనట్లు తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు


మంగపేట: బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు


గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట: మండలంలోని గోవిందరావుపేట, పస్రా, చల్వాయి గ్రామాల్లో పోచమ్మ తల్లికి శ్రావణమాసం బోనాలను ఘనంగా సమర్పించారు. బుధవారం గ్రామాల్లోని ఇళ్ల నుంచి బోనాన్ని నెత్తిన ఎత్తుకోని డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు ఆలయానికి వెళ్లారు. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. వర్షాలు బాగా కురిసి, పాడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని మంగపేట, నర్సింహసాగర్ తదితర గ్రామాల్లో శ్రావణ మాసం సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని సాయంత్రం వందలాది మంది మహిళలు బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా కల్వర్టు



ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏటూరునాగారం–ఎక్కెల గ్రామాల మధ్యలోని కాల్వర్టు ప్రమాదకరంగా ఉంది. కల్వర్టు మొత్తం తెగిపోయి శిథిలావస్థకు చేరుకోవడంతో గొత్తికోయగూడేలకు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు భారీగా వరద ప్రవహిస్తోంది. ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - ఏటూరునాగారం

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : నరేష్, పీఆర్ డీఈఈ
ఫోన్‌నంబర్ : 7981016150

బీసీ–ఏ సర్టిఫికెట్లు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట: వాడబలిజ కులస్తులకు బీసీ–ఏ కుల సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరుతూ వాడబలిజ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్ర దామోదర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరస్వామికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కొందరు వాడబలిజ కులస్తులు బెస్త కులస్తులుగా ధ్రువీకరణ పత్రాలు పొంది ఉన్నారన్నారు. వాటిని రద్దు చేస్తూ వాడబలిజ కులస్తులకు వాడబలిజ బీసీ–ఏగా కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాడబలిజ సేవాసంఘం మండల అధ్యక్షుడు గౌరారపు రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి తోట తిరుపతి, కోశాధికారి బొల్లె రాములు, మంగపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు హనుమంతు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రఘుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాపారావు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


మంగపేట: చెక్కులను అందజేస్తున్న లక్ష్మణ్‌రావు


ఏటూరునాగారం: శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని తన నివాసంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గడదాసుసునీల్‌కుమార్ అధ్యక్షతన 11 మంది లబ్ధిదారులకు రూ.3.21లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, నాయకులు ఖాజాపాషా, మల్లారెడ్డి, మహేష్, రాంనర్సయ్య, రామ్మూర్తి, ప్రదీప్‌రావు, చంద్రబాబు, నర్సింహులు, కోటయ్య పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్‌తో బుధవారం అందజేశారు. మండలంలోని బోరునర్సాపురం, కొత్తపేట, రమణక్కపేట, పాలాయిగూడెం గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.2.34 లక్షల విలువ గల చెక్కులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, నాయకులు శిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, కాకులమర్రి ప్రదీప్‌రావు, ఎడ్లపెల్లి నర్సింహారావు, చిలకమర్రి రాజేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం: మొగ్గం వర్క్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. బుధవారం మండలంలోని సాయిబాబా ఆలయం ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌బీఐ, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మొగ్గం వర్కర్‌లో ఉచితంగా మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మహిళలకు 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నారని శిక్షణ సమయంలో భోజన వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోరిక గోవింద్ నాయక్, గడదాసు సునీల్‌కుమార్, కాకులమర్రి ప్రదీప్‌రావు, తాడూరి రఘు, సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఫ్యాకల్టీ బషీర్, ట్రైనర్ రజిత పాల్గొన్నారు.

యువకులు దేశభక్తిని చాటుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: యువకులు దేశభక్తిని చాటుకోవాలని ఎస్సై తాజొద్దీన్, బీజేపీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి దేశంపై ప్రేమను పెంచుకోవాలన్నారు. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గండెపల్లి సత్యం, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామరాజు, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ప్రణయ్, వినుకోళ్ల చక్రవర్తి, కందగట్ల రమేశ్, ఎలుకపల్లి శ్రీను, పలక గంగా, గద్దల హరిబాబు, అజిత్, ప్రవీణ్, రజిని, శ్రీనులతోపాటు ఉపాధ్యాయులు రాజన్న, నాగరాజు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

ములుగు రూరల్: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధిని ఎంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అబ్బాపురంలో తోట దేవేందర్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ షాప్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జయపాల్‌రెడ్డి, గండి కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

8 కిలోల ఎండుగంజాయి పట్టివేత


నిందితులను చూపిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

ములుగు: భద్రాచలం నుంచి ములుగుకు తరలిస్తున్న 8 కిలోల ఎండుగంజాయిని ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో బుధవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా సంచితో కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని చూడగా అందులో గంజాయి ఉన్నట్లుగా తేలిందన్నారు. విచారణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి జిల్లా చింతూరు మండలం బురఖానకోటకు చెందిన ముర్రె రామకృష్ణ, ప్రకాశం జిల్లా చింతలపాడు గ్రామానికి చెందిన భూదాల మురళిగా ఒప్పుకున్నారని అన్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.లక్ష 92వేల 250 వరకు ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాహిల్

వాజేడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు వైద్యాధికారి రాహిల్ అన్నారు. మండల పరిధిలోని చంద్రుపట్ల ఎస్సీ కాలనీలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వర్షాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జ్వరాల తీవ్రత ఎక్కువ రాకుండా జాగ్రత్తగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. రోగులను పరీక్షించడంతో పాటు జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు.

గడ్డిమందు స్వాధీనం

కాటారం: బిల్లులు లేకుండా మహారాష్ట్ర నుంచి కాటారం మీదుగా తరలిస్తున్న గడ్డిమందు(గ్లైఫోసెట్)ను మండల కేంద్రానికి సమీపంలోని బొప్పారం క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు గడ్డిమందు సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు బొప్పారం క్రాస్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఏలాంటి బిల్లులు లేని 80 లీటర్ల గడ్డిమందు బాటిల్స్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గడ్డిమందు రవాణా చేస్తున్న మహాముత్తారం మండలానికి చెందిన రణదీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మండలంలో 17 మందికి అవార్డులు

గోవిందరావుపేట: జిల్లాలో వివిధ డిపార్ట్‌మెంట్‌లల్లో పని చేసే 190 మంది ఉద్యోగస్తులను ప్రభుత్వం బెస్ట్ ఎంప్లాయీ అవార్డులకు ఎంపిక చేయగా అందులో మండలం నుంచి 17 మంది ఎంపికయ్యారు. ఎంపిక అయిన వారు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నేడు(గురువారం) కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ దివాకర టీఎస్ చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పస్రా అచ్చ కమలాకర్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి ఆర్‌ఐ సుధాకర్, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ నుంచి ఏఓ జితేందర్ రెడ్డి, చల్వాయి 5వ బెటాలియాన్ నుంచి వివిధ హోదాల్లో ఉన్న 9 మందికి, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి బీట్ ఆఫీసర్ సీతారాం, మెడికల్ అండ్ డిపార్ట్‌మెంట్ నుంచి సబ్ ఆర్డినేటర్ ప్రతాప్, రూరల్ డెవలాప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ సమ్మయ్య, వెటర్నరీ డిపార్ట్‌మెంట్ నుంచి డా.రాజశేఖర్, జిల్లా ప్రజా పరిషత్ నుంచి సూరింటెండెంట్ సాయిదుర్గ అవార్డులకు ఎంపికైయ్యారు.

హెచ్‌ఎం, వార్డెన్‌ను నియమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళ హెచ్‌ఎం, వార్డెన్‌లను నియమించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. మండల పరిధిలోని చిరుతపల్లిలోని రెండు ఆశ్రమ పాఠశాలల్లో మహిళ వార్డెన్, హెచ్‌ఎంలు లేరని అన్నారు. బాలికలు చదువుతున్న ఈ పాఠశాలల్లో బాలికలకు సంరక్షణ కోసం మహిళ టీచర్లనే వార్డెన్‌లుగా నియమించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ అధికారులు తనిఖీలు చేసి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగ గణేష్, ప్రతాప్, కనితి వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

జవాన్ల పహారా.. ప్రజలకు రక్షణ


దేశంలో ఉన్న సంస్కృతి సంప్రదాయాలను కనిపించే విధంగా చిత్రీకరించిన అమృత

ఏటూరునాగారం: దేశ రక్షణకు సరిహద్దుల్లో జవాన్లు పహారా కాస్తుండడంతో ప్రజలు సురక్షితంగా జీవనం సాగిస్తున్నారని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాసాని అమృత తోటి విద్యార్థులకు వివరించారు. బుధవారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నేటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చిత్ర లేఖన పోటీలను నిర్వహించారు. భారతదేశంలో రాకెట్ తయారు, దేశ రక్షణ, పోలీసులు, వ్యవసాయం, పలు ప్రాముఖ్యత నిర్మాణాలను వివరిస్తూ అమృత భారతదేశం చిత్ర పటాన్ని గీసి అబ్బురపరిచింది.

క్రీడల్లో గెలుపోటములు సహజం


షీల్డులు అందజేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: క్రీడల్లో గెలుపు ఓటములను సహజమని క్రీడాకారులు రెండింటిని సమానంగా స్వీకరించాలని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈ రోజు ఓటమి రేపటి గెలుపునకు బాట కావాలన్నారు. గ్రామంలో ఆపదలో ఉన్న వారికి యువత సహాయం చేయాలన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, గ్రామంలో మంచి పని కోసం ముందుండాలన్నారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పంబపూర్, ద్వితీయ బహుమతి పడిగాపూర్ టీంలు విజయం సాధించడంతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా విజేలకు షీల్డ్‌లు అందజేశారు. కామారం గ్రామానికి చెందిన బెస్ట్ ప్లెయిర్‌గా ప్రతిభ చూపిన సంజయ్‌కు షీల్డ్ బహూకరించారు. విధి నిర్వహణలో భాగంగా క్రీడలను నిర్వహించడంలో బాధ్యతగా పని చేసిన కానిస్టేబుళ్లు పూజారి రమేశ్, సాంబయ్యలను ఎస్సై అభినందించారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

రేగొండ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాకర్లపల్లి ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి పొనగల్లు గ్రామం వరకు రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తాం..

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో నిర్మించిన గెజిటెట్ అధికారుల కమ్యూనిటీ భవనాన్ని కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, గెజిటెడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఉన్నారు.